సాగర తీరం.. చమురుమయం!



తీరంలోకి చమురు వ్యర్థాలను విడుదల చేస్తున్న కార్ వాష్ షెడ్

సముద్రంలోకి నేరుగా చమురు వ్యర్థాల విడుదల

వాసవానిపాలెంలోని ఓ కార్ వాష్ షెడ్ యజమాని నిర్వాకం

కాలుష్యం బారిన స్థానిక మత్స్యకారులు

పట్టించుకోవాలని అధికారులకు విజ్ఞప్తి


మత్స్యకార నివాసాల చెంత వ్యర్థాలు

ఎంవీపీకాలనీ: చమురు వ్యర్థాల వల్ల సాగర తీరం.. మహో ఘోరంగా తయారవుతోంది. అప్పుఘర్ దరి వాసవానిపాలెం వద్ద సముద్రంలోకి యథేచ్ఛగా చమురు వ్యర్థాలను విడుదల చేయడం కలకలం రేపుతోంది. ఈ కారణంగా కాలుష్యం బారిన పడి స్థానిక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంప్రదాయ డ్రైనేజీని కాదని తీరాన్ని ఆనుకుని ఉన్న ఓ కార్ వాష్ షెడ్ నిర్వాహకుడు వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి వదలుతుండటమే ఈ సమస్యకు ప్రధాన కారణం. కార్ వాష్ యజమాని నివాస ప్రాంతాల పక్క నుంచి నేరుగా కాలువ తవ్వి చమురు వ్యర్థాలు తీరంలోకి విడుదల చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో పెద్ద ఎత్తున కలుషిత గాలులు పీల్చడం, దుర్వాసన, దోమల బెడదతో అనారోగ్యాలకు సైతం గురవుతున్నట్లు వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

600 మీటర్ల పొడవునా పైప్‌లైన్, డ్రైనేజీ..

అప్పుఘర్‌లోని లుంబినీ పార్క్, వాసవానిపాలెం మధ్యలో ఈ కార్ వాష్ షెడ్ ఉంది. బీచ్ రోడ్డును ఆనుకొని సముద్ర తీరం వైపుగా కార్ వాషింగ్ కార్యకలాపాలు సాగిస్తున్నారు. షెడ్ విస్తరణ కోసం లుంబినీ పార్క్ స్థలాన్ని కూడా ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు అనధికారికంగా 600 మీటర్లు ప్రత్యేక పైప్‌లైన్లతోపాటు డ్రైనేజీ తవ్వి మరీ చమురు వ్యర్థాలను కార్ వాష్ నిర్వాహకులు తీరంలోకి విడుదల చేస్తున్నారు. షెడ్‌లోని వాహనాల నుంచి వేరు చేసే నిల్వ చమురుతో పాటు కార్లు వాటర్ వాష్ చేసే సమయంలో ఇంజిన్ నుంచి వెలువడే చమురు వ్యర్థాలను పైప్‌లైన్‌ల సాయంతో ఆ డ్రైనేజీలో వదులుతున్నారు. పెద్ద అలలు వచ్చినప్పుడు డ్రైనేజీలోని వ్యర్థాలు తీరంలోకి కొట్టుకుపోతుండగా.. కొన్నిసార్లు డ్రైనేజీలోనే నెలలు తరబడి నిల్వ ఉండి స్థానికులను అనారోగ్యానికి గురిచేస్తున్నాయి. తీరం వైపు చమురు వ్యర్థాలను విడుదల చేయొద్దని అనేక సార్లు స్థానిక మత్స్యకారులు సూచించినా.. కార్ వాష్ నిర్వాహకులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.


డ్రైనేజీలో నిలిచిపోయిన చమురు వ్యర్థాలు

బస్టాప్ సైతం ఆక్రమణ..

ఈ కార్ వాష్ యజమాని ఇటీవల తన షెడ్‌ను ఆనుకుని ఉన్న జీవీఎంసీ బస్టాప్‌ను సైతం అనధికారికంగా ఆక్రమించుకున్నట్లు ఆరోపణలున్నాయి. బస్టాప్‌లో రెండు చోట్ల ప్రయాణికులు కూర్చునేందుకు బెంచీలు, షెడ్లు ఉండగా.. వాటిని ఆక్రమించుకొని వినియోగించుకుంటూ ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారం కూడా సాగిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు ఉండటంతో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పలు మార్లు చర్యలు తీసుకొని అక్కడి ఫాస్ట్‌ఫుడ్ కౌంటర్లను తొలగించారు. కొన్ని రోజుల విరామం తర్వాత మళ్లీ ఫాస్ట్‌ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేస్తూ అధికారులకు చుక్కలు చూపిస్తున్నారు. జీవీఎంసీ జోన్-3 అధికారులు సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కార్ వాష్ షెడ్‌ను ఆనుకుని ఉన్న బస్టాప్‌లో ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ కౌంటర్


అప్పుఘర్ దరి సాగర తీరంలోకి పైప్‌లైన్ నుంచి విడుదల చేస్తున్న వ్యర్థాలు

మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశాం

వాసవానిపాలెం మత్స్యకారులను కొన్నేళ్లుగా ఈ సమస్య వేధిస్తోంది. కార్ వాష్ షెడ్ యజమానికి వ్యర్థాలను తీరం వైపు విడుదల చేయొద్దని అనేక సార్లు సూచించినా.. పట్టించుకోవడం లేదు. పైగా లుంబినీ పార్క్‌ను ఆనుకొని ప్రభుత్వ భూమిని ఆక్రమించి మరీ కార్ షెడ్ విస్తరించాడు. దీంతో స్థానిక మత్స్యకారులకు అన్ని విధాల నష్టం జరుగుతోంది. ఈ సమస్యపై మత్స్యకారుల యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా గ్రీవెన్స్‌లో, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాం. ఈ నెల 12లోపు సమస్య పరిష్కరిస్తామని ఫిర్యాదు రసీదులో పేర్కొన్నారు. అధికారుల చర్యల కోసం ఎదురుచూస్తున్నాం.

– తెడ్డు శంకర్‌రావు, మత్స్యకార సంఘ నాయకుడు

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-3 ఈఈ(ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంతపాలెం, రవీంద్రనగర్, తోటగరువు, గాంధీనగర్, అన్నానగర్, బాలాజీనగర్, శ్రీహరినగర్, కైలాస్‌నగర్, ముస్తఫా కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కొండవాలులో రక్షణ గోడల నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా తదితరులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతంలో రక్షణ గోడల నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యలతో కలిసి మేయర్ పీలా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు చాలా అవసరమున్నందున కార్పొరేటర్ సూచనల మేరకు రూ.3.5 కోట్ల అంచనా వ్యయంతో రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-3 కమిషనర్ శివప్రసాద్, ఈఈ గంగాధర్, సచివాలయ కార్యదర్శులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఏయూక్యాంపస్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ దినోత్సవం సందర్భంగా లగుడు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లగుడు గోవిందరావు ఆధ్వర్యంలో గురువారం ట్రస్ట్ సభ్యులు రక్తదానం చేశారు. జిల్లా పరిషత్ వద్దనున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. రక్తదాతలను రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు.

పాకిస్తాన్‌తో కరాచీ స్టోర్స్‌కు సంబంధం లేదు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు

బీచ్‌రోడ్డు: కరాచీ స్టోర్స్‌కు పాకిస్తాన్‌తో ఎటువంటి సంబంధం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ రాజు స్పష్టం చేశారు. సిరిపురం దత్ ఐలాండ్ దరి కరాచీవాలా డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ వద్ద గురువారం బీజేపీ జిల్లా నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాచీవాలా డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ యజమానులు భారత దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు సింధు నది పరివాహక తీరంలోని కరాచీ అనే ప్రాంతంలో నివసించే వారని, అక్కడి నుంచి వీరు విశాఖకు వలస వచ్చి స్థిరపడి ఈ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌ను నడుపుతున్నారన్నారు. ఇటీవల కరాచీ స్టోర్స్ మీద జరిగిన దాడికి బీజేపీకి కానీ, భారతీయ జనతా యువ మోర్చాకు కానీ ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ధోని నాగరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంపై హర్షం

మద్దిలపాలెం: శాంతికి మారుపేరుగా నిలిచే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యుద్ధం మొదలు పెట్టారని, లక్ష్యం నెరవేరే వరకు అది ఆగదని బీజేపీ బీసీ నేత మూల వెంకటరావు అన్నారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ప్రధాని మోదీ నాయకత్వంలో గట్టి సమాధానం ఇచ్చామన్నారు. సాయుధ దళాలు ఒక్కటై శత్రు దేశాన్ని మట్టి కరిపించడంపై యావత్ భారతావని సంతోషంతో ఉందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం తీసుకున్న సైనిక చర్యను భారతీయులతోపాటు ప్రపంచ దేశాలు కూడా హర్షిస్తున్నాయన్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

మద్దిలపాలెం: ఈ నెల 20న తలపెట్టిన అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ జోన్ కమిటీలు పిలుపునిచ్చాయి. మద్దిలపాలెం కార్యాలయంలో గురువారం సమ్మె పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.వెంకటరావు, డి.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇవి అమలైతే కార్మిక వర్గం అనేక హక్కులను కోల్పోతుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించరాదని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలు ఆపాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐతో కూడిన సమగ్ర చట్టం చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. విశాఖ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో జాతీయ సమ్మెపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 20న సమ్మె పాటిస్తూ కార్మిక వర్గం మొత్తం రైల్వే డీఆర్ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ, అనంతరం సభ జరుగుతాయని చెప్పారు. సీఐటీయూ నాయకులు నరేంద్రకుమార్, రాజ్‌కుమార్, ఐసీ నాయుడు, ఎ.సింహాచలం, లక్ష్మణరావు, వెంకటరమణ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రైతుబజార్‌లో తూనికలు, కొలతలపై అవగాహన

ఎంవీపీకాలనీ: జిల్లా లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ లీగల్ కంట్రోలర్ రవికుమార్, పలువురు విభాగాధికారులు రైతులు, వినియోగదారులకు తూనికలు, కొలతలపై అవగాహన కల్పించారు. రవికుమార్ మాట్లాడుతూ కూరగాయల తూకల్లో తేడాలను వినియోగదారులు గుర్తించాలన్నారు. కూరగాయలు, ఇతర వస్తువులను కొనే సందర్భంలో తూకల్లో జరిగే మోసాలను విపులంగా వివరించారు. ఎలాంటి మోసాన్ని గుర్తించిన స్థానిక తూనికలు, కొలతల విభాగం అధికారులతో పాటు రైతుబజార్ ఈవో దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో విభాగ ఇన్‌స్పెక్టర్ రామారావు, మర్రి సత్యనారాయణ, రైతుబజార్ ఈవో వరహాలు, వినియోగదారుల సంఘం ప్రతినిధులు సత్యకుమార్, భాస్కర్‌రావు, సెయింట్ జోషఫ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న జిల్లా లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ అధికారులు

ధార్మిక సంఘాల ఐక్యతతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట

సీతంపేట: ధార్మిక సంఘాల ఐక్యతతో బాల్య వివాహ రహిత విశాఖ జిల్లా సాధ్యమని మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిప్యూటీ కలెక్టర్ శంసున్నీషా బేగం అన్నారు. అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ 'యాక్సిస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్' అనే ప్రాజెక్టులో భాగంగా అన్ని వర్గాల ధార్మిక సంఘ నాయకులకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధంలో ధార్మిక సంఘాలు ముఖ్య పాత్ర పోషించాలని కోరారు. మైనారిటీ సంక్షేమ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తెలియచెప్పడం ఎంత అవసరమో తెలిసిందన్నారు. పురోహిత సంఘ ప్రతినిధి ఆర్.రామారావు మాట్లాడుతూ బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా మాకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయన్నారు. క్రిస్టియన్ సమాజ ప్రతినిధులు రెవరెండ్ ఇమ్మానుయేల్ సువర్ణరాజు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికలు బాల్యాన్ని, విద్యను కోల్పోతున్నారని, ఎట్టి పరిస్థితుల్లో వీటిని ప్రోత్సహించరాదన్నారు. అప్‌హోల్డ్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ జి.డేవిడ్‌రాజు మాట్లాడుతూ తమ సంస్థ జిల్లా, గ్రామ స్థాయిలో ప్రతి స్కూల్, కళాశాలలో బాల్య వివాహాల నిషేధంపై అనేక కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. బాల్య వివాహాల నిషేధానికి కృషి చేస్తామని ధార్మిక సంఘ నాయకులంతా ప్రతిజ్ఞ చేశారు. రెవరెండ్ సూర్యకిరణ్, చక్రవర్తి, కె.వై.రత్నం పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న మైనారిటీ కార్పొరేషన్ ఈడీ శంసున్నీషా బేగం, ధార్మిక సంఘాల ప్రతినిధులు

రోడ్డు మధ్యలో గొయ్యితో ప్రమాదాలు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి కూడలి నుంచి సూర్యతేజనగర్ మీదుగా పార్వతీనగర్ గెడ్డ వరకు డబుల్ రోడ్డు మధ్యలోని గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఇరుకుగా ఉన్న ఈ రహదారిని జీవీఎంసీ రెండేళ్ల కిందట విస్తరించి డబుల్ రోడ్డుగా నిర్మించిన విషయం తెలిసిందే. మూడు నెలల క్రితం సూర్యతేజనగర్ వద్ద వాటర్ పైప్‌లైన్ పాడవడంతో నీటి సరఫరా విభాగం సిబ్బంది ఇక్కడ రోడ్డు మధ్య పెద్ద గొయ్యి తవ్వి దాన్ని బాగుచేశారు. పని పూర్తయిన తర్వాత గొయ్యిని మట్టితో పూడ్చి మెటల్ వేయకుండా వదిలేశారు. ఇప్పుడు ఆ మట్టి కిందకు దిగిపోయి రోడ్డు మధ్యలో గొయ్యిలా మారడంతో వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. సూర్యతేజనగర్ అమ్మవారి గుడి ఎదురుగా మలుపులో ఉన్న ఈ గొయ్యి వద్ద ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మలుపు వద్ద రాత్రివేళ సరిగా గొయ్యి కనిపించకపోవడంతో ఎక్కువ మంది ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ గొయ్యి భాగంలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.


సూర్యతేజనగర్ వద్ద రోడ్డు మధ్యలో తవ్వి వదిలేసిన గొయ్యి

వికసించిన మే పుష్పం


ఈశ్వరినగర్‌లోని ఓ ఇంట్లో వికసించిన మే పుష్పం

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు కొండవాలు ప్రాంతంలోని ఓ ఇంట్లో అరుదైన 'మే' పుష్పం వికసించింది. ఈశ్వరినగర్‌లోని కె.కృష్ణ పాత్రుడు ఇంటి ఆవరణలో ఏడేళ్ల కిందట మే పుష్పం విత్తనం నాటారు. అది మూడేళ్లగా మే నెలలో పువ్వు పువ్వులు పూస్తోంది. కొద్ది రోజులేగా ఈ మొక్కకు రెండు మొగ్గలు వచ్చాయి. వాటిలో ఒకటి శుక్రవారం పూర్తిగా వికసించింది. మరొకటి 2, 3 రోజుల్లో వికసించనుంది. ఇవి అరుదైన పుష్పాలని, ప్రతి ఏడాది మే మొదటి, రెండు వారాల్లో పువ్వులు పూస్తాయని ఇంటి యజమాని కృష్ణ తెలిపారు. వికసించిన పుష్పం వారం వరకు తాజాగా ఉంటుందన్నారు. వీటిని చూడటానికి స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.

జీవిత బీమాపై ప్రజల్లో ఆసక్తి

బీచ్‌రోడ్డు: దేశంలో జీవిత బీమా కలిగిన వారి శాతం రికార్డు స్థాయిలో 78 శాతానికి చేరిందని యాక్సిస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ త్రిపాఠి తెలిపారు. మార్కెటింగ్ డేటా విశ్లేషణ సంస్థ కాంతార భాగస్వామ్యంతో నిర్వహించిన ఇండియా ప్రొటెక్షన్ కోషియంట్(ఐపీక్యూ) సర్వే ఏడో ఎడిషన్ ఫలితాల వివరాలను గురువారం ఆయన మీడియాకు వెల్లడించారు. 25 దేశ నగరాల్లోని 6,360 గృహాలను ఈ సర్వే కవర్ చేసిందన్నారు. పట్టణాల్లో ప్రొటెక్షన్ కోషియంట్ 2019లో ఉన్న 35 నుంచి 2025లో 48కి చేరిందని చెప్పారు. ఇది ఆర్థిక సన్నద్ధతలో అభివృద్ధిని సూచిస్తోందన్నారు. దీంతో జీవిత బీమా కలిగిన వారి శాతం అత్యధికంగా పెరిగిందన్నారు.

అందుబాటులోకి మ్యూజికల్ ఫౌంటెయిన్

మహారాణిపేట: సెంట్రల్ పార్క్‌లో కొంత కాలంగా నిలిచిపోయిన మ్యూజికల్ ఫౌంటెయిన్ తిరిగి అందుబాటులోకి వచ్చింది. సుమారు రూ.22.50 లక్షలతో ఆధునీకరించిన ఫౌంటెయిన్‌ను గురువారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కమిషనర్ సీహెచ్ విశ్వనాథన్‌తో కలిసి ప్రారంభించారు. నూతన పాటలతో రూపొందించిన ఈ ఫౌంటెయిన్ సెంట్రల్ పార్క్‌కు వచ్చే సందర్శకులకు అదనపు ఆకర్షణ అని ప్రణవ్ గోపాల్ తెలిపారు. దీనివల్ల సందర్శకుల సంఖ్య పెరుగుతుందని మెట్రోపాలిటన్ కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

వైభవంగా ధ్వజ స్తంభం పునఃప్రతిష్ఠ



ధ్వజ స్తంభం పునఃప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణ, భక్తుల శివన్నామస్మరణ నడుమ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గవ్యాంత పూజలు, శేష హోమాలు, యంత్రార్చన, బలిహరణ, యంత్రస్థాపనం, గోదర్శనం, కళాన్యాసములు, కుంభాభిషేకం జరిపించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో గ్రంథాలయాల అభివృద్ధి

విశాఖ విద్య: భావితరాలకు ఉపయోగపడేలా గ్రంథాలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలోని డాక్టర్ వీఎస్ కృష్ణా లైబ్రరీని గురువారం ఆయన సందర్శించారు. అక్కడున్న సౌకర్యాలను పరిశీలించారు. తాళపత్ర గ్రంథాలను పరిశీలించి, భావితరాలకు చరిత్ర తెలిసేలా వీటిని భద్రపరచడం అభినందనీయమన్నారు. అందుబాటులో ఉన్న పుస్తకాలు, ఇంకా ఏమైనా వసతులు కల్పించాలనే దానిపై లైబ్రరీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విశాఖ నగర గ్రంథ పాఠకులతోపాటు ఏయూ క్యాంపస్ కాలేజీల విద్యార్థులకు డాక్టర్ వీఎస్ కృష్ణా లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్తకాలు ఎంతో సౌలభ్యంగా ఉన్నాయని చైర్మన్ దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. పోటీ పరీక్షార్థుల కోసం ఏర్పాటు చేసిన స్టడీ హాల్, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు.


ఏయూ లైబ్రరీ అధికారులు, సిబ్బందితో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ వెంకటేశ్వరరావు

'రుగ్మత' షార్ట్‌ఫిల్మ్‌కు విశిష్ట గుర్తింపు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగం విద్యార్థులు రూపొందించిన 'రుగ్మత' షార్ట్‌ఫిల్మ్‌కు విశిష్ట గుర్తింపు లభించింది. ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఏయూ విద్యార్థులు ప్రదర్శించిన 'రుగ్మత' అందరి హృదయాలను చలింపజేసింది. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ తెలంగాణ-భారతీయ చలనచిత్ర నిర్మాతల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్టీజియస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'రుగ్మత' ఉత్తమ షార్ట్ ఫిల్మ్‌గా ఎంపికైంది. ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన కె.పరమేశ్వరరావుకు ఉత్తమ నటుడి అవార్డు లభించింది. అవార్డు అందుకొని గురువారం ఏయూకు వచ్చిన విభాగ విద్యార్థి పరమేశ్వరరావును వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహారావు ప్రత్యేకంగా అభినందించారు. సామాజిక సమస్యలపై అందరికీ అవగాహన కల్పించేలా చేసిన ప్రయోగం స్ఫూర్తిదాయకమన్నారు. థియేటర్ ఆర్ట్స్ విభాగం ఆచార్యులు డాక్టర్ మరబట్ల భాస్కరరావు, డాక్టర్ త్రినాథరావు, పితాని ప్రసాద్, డైరెక్టర్ వంశీలు పరమేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.


ఉత్తమ నటుడు అవార్డు గ్రహీత పరమేశ్వరరావును అభినందిస్తున్న ఏయూ వీసీ, రిజిస్ట్రార్

బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై ఆహార వ్యర్థాలు


బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై భోజనం కవర్లు


సందర్శకులు కూర్చునే బెంచీపై నూనె మరకలు

ఏయూక్యాంపస్: సాగర తీరంలోని ఫుట్‌పాత్‌లపై ఆహార పదార్థాల వ్యర్థాలు నిత్యం దర్శనమిస్తున్నాయి. బీచ్ రోడ్డులో ఉదయం వేళల్లో వాకింగ్‌కు వచ్చే వారికి ఫుట్‌పాత్‌లపై ఇవి ఇబ్బందికరంగా నిలుస్తున్నాయి. రాత్రి వేళలో తీరంలోని బెంచీలపైన, ఫుట్‌పాత్‌ల పక్కనే ఉన్న దిమ్మెలపైన నగరవాసులు ఆహార పదార్థాలు, బిర్యానీలు, ఫాస్ట్‌ఫుడ్‌లు తిని వ్యర్థాలు, కవర్లు, సీసాలను అక్కడే పడేస్తున్నారు. దీంతో ఉదయం వేళల్లో బీచ్‌కు వచ్చే నగరవాసులు, పర్యాటకులకు ఇవి కొంత ఇబ్బందికరంగా మారుతున్నాయి. సందర్శకులు తిని వదిలేసిన ఆహార పదార్థాల కోసం కుక్కలు సైతం వస్తున్నాయి. రాత్రి వేళల్లో సాగర తీరంలో ఫుట్‌పాత్‌లు, డస్ట్ బిన్‌లు శుభ్రం చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.